# మత్స్య వృత్తి రక్షణకై చర్యలు చేపట్టండి
# సంక్షేమానికి కేటాయించిన నిధుల ఖర్చు చేయాలి.

## – సిపియం

**సోదరీ, సోదరులారా !**

ఆంధ్రప్రదేశ్‌లో 974కి.మీ. తీరప్రాంతం వుంది. 555 మత్స్యకార గ్రామాల్లో సుమారు 6.50లక్షల మంది మత్స్యకార వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో చేపలు, రొయ్యలు, తదితర ఉత్పత్తుల ద్వారా వచ్చిన ఆదాయం 22వేలకోట్లు. కానీ నేటి ప్రభుత్వ విధానాలవలన వారికి చేరేది నామమాత్రం తీరప్రాంతాల్ని పారిశ్రామిక కారిడార్ల పేరుతో, సముద్రంలో యజమానులు యాంత్రిక బోట్ల తాకిడికి వీరి ఉపాధి క్రమంగా పోతోంది. వాగ్దానాలే తప్ప ఆచరణ శూన్యంగా ప్రభుత్వ విధానం వుంది. ఉన్న కొద్దిపాటి ఉపాధిని క్రమంగా దెబ్బతీస్తున్నారు. వీరి రక్షణా, సంక్షేమంకోసం ఉద్యమించడమే ఏకైకమార్గమని సిపియం భావిస్తుంది.

మత్స్య సహకార సంఘాల రుణ బకాయిల రూ.42కోట్ల రూపాయలు రద్దుచేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలముందు వాగ్దానం చేసింది. ఇంతవరకూ రుణాలు మాఫీ కాలేదు. ఈ సంవత్సరం మత్స్య వృత్తి అభివృద్ధికి, మత్స్య కారుల సంక్షేమానికి రూ.124కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. కానీ నిధులు విడుదలచేయలేదు. లబ్దిదారుల్ని గుర్తించలేదు. చేపలవేట నిషేధ కాలంలో మత్స్యకారులకు పునరావాసం క్రింద రూ.14కోట్లు కేటాయించినా అందులో రూ.3కోట్లు మాత్రమే విడుదల చేసి పండగచేసుకోమంటోంది. జి.వో నెం: 353ప్రకారం మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా సంస్థాగత రుణాలు అందించి చేప పిల్లలు, వలలు, సైకిళ్ళు, పడవలు కొనుక్కునేందుకు వెసులుబాటు కల్పిస్తామని చెప్పినా ఆచరణలో వాటి ఊసేలేదు.

మత్స్యకారులకు జీవనాధారంగా వున్న పంచాయితీరాజ్, మైనర్ ఇరిగేషన్, చెరువులను మత్స్యసొసైటీలకు ఇవ్వకుండా ఆదాయం కోసమని బహిరంగ వేలం వేసి మత్స్యకారుల కడుపు కొట్టడం దారుణం. గత రెండు సంవత్సరాలనుండి చెరువులను పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు బహిరంగ వేలం ద్వారా అప్పగించడం వలన మైదాన, మరియు మెట్ట ప్రాంతాల్లో వున్న మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. వీరి పొట్ట గొట్టి ప్రభుత్వ ఖజానా నింపుకోవడం సిగ్గుమాలిన చర్య. లక్షలాదిమంది నిరుపేదలుగా వున్న మత్స్యకారులకు సముద్ర ప్రాంత భూములను ఇస్తామని హామీ ఇచ్చి ఆచరణలో పారిశ్రామికాధిపతులకు కట్టబెడుతుంది. సోంపేట, మందస, కాకరపల్లి, గంగవరం, భోగాపురం, తదితర సముద్ర తీర ప్రాంతాల్లో సముద్ర బంజర్లను, చేపలు పట్టే రేవులను, కోస్టల్ కారిడార్, పిసిపిఐఆర్, ఎన్‌ఓబి పేర్లతో కార్పొరేట్ శక్తులకు స్వాధీనం చేస్తున్నది. ఆ ప్రాంతాలనుండి మత్స్యకారులను బలవంతంగా గెంటివేస్తున్నారు. వృత్తినుండి బలవంతంగా బయటకు వెల్లగొట్టి రాష్ట్ర ప్రభుత్వం వలసలను ప్రోత్సహిస్తుంది. సముద్ర, నది తీరప్రాంతాల్లోని ప్రజలను ప్రాజెక్టుల పేరుతో తరిమేస్తున్నారు. ఎదురు తిరిగితే అక్రమకేసులు బనాయిస్తున్నారు. అడ్డు తగిలితే పోలీసులు కాల్పులు జరిపి ప్రాణాలు తీస్తున్నారు. రక్షించాల్సిన ప్రభుత్వమే మత్స్యకారులను భక్షిస్తుంది.

పట్టణాల్లో చేపల మార్కెట్లను వేలంవేసి కమీషన్ వ్యాపారస్థులకు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నారు. నెల్లూరు, గుంటూరు తదితర పట్టణాల్లో మహిళా మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాలని వుండగా వారి హక్కులను హరించి వేస్తున్నారు. మార్కెట్లనుండి మత్స్యకారులను వెళ్లగొట్టి రిలయన్స్ ఫ్రెష్, మెట్రో రిటైల్ షాపులను కేటాయిస్తున్నారు. ఈ విధంగా మత్స్యకారులకు జీవనాధారంగా వున్న వృత్తులను దెబ్బతీస్తుంది. ఉపాధి కోల్పోయి ప్రత్యామ్నాయంలేక సుదీర్ఘ ప్రాంతాలకు చేపలు పట్టడానికి వలసలుపోయి మృత్యువాత పడుతున్నారు. చనిపోయినవారికి వారంరోజుల్లోనే రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తానని చేసి వాగ్దానం అమలుకావడంలేదు. మాటలు కోటలు దాటినా ఆచరణ గడపదాటడంలేదు.

మత్స్యకారుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలద్వారా విద్యను అందిస్తామని పదే పదే ప్రచారం చేస్తుందేగానీ ఎక్కడా ఒక్క పాఠశాలకూడా ఏర్పాటు చేయలేదు. ఈ విధంగా మత్స్యకారులు అన్ని రకాల ఇబ్బంధులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపియం పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది. ఆగష్టు 7,8,9 తేదీల్లో జరిగే ప్రచార ఆందోళనల్లో, ఆగష్టు 14న జరిగే ధర్నాలలో మత్స్యకారులు పాల్గొనాలని పిలుపునిస్తుంది.

**<u>డిమాండ్లు</u>**

1. ఏప్రిల్, మే నెలలో వేట నిషేధ కాలంలో ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రూ.6000లు నగదు, 100కేల బియ్యం, 10కేజీల పప్పుదినుసులు, 20లీటర్ల కిరోసిన్ వెంటనే ఇవ్వాలి.
2. మత్స్యకారుల సహకార సంఘాల రుణ బకాయిలు 42కోట్ల రూపాయలను వెంటనే మాఫీచేయాలి.
3. ప్రమాదవాశాత్తు మరణించిన ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి ఇన్స్యూరెన్స్, ఎక్స్‌గ్రేషియా క్రింద రూ.10లక్షలు ఇవ్వాలి. పెండింగ్‌లో వున్న 300మంది ఎక్స్‌గ్రేషియాలు వెంటనే చెల్లించాలి.
4. 50సంవత్సరాలు దాటిన ప్రతి మత్స్యకార్మికునికి రూ.2000లు వృద్ధాప్యపు ఫించన్ మంజూరు చేయాలి.
5. సముద్రతీర బంజర భూములను ప్రతి కుటుంబానికి ప్రభుత్వ వాగ్దానం మేరకు మూడు ఎకరాలు ఇవ్వాలి.
6. పంచాయితీరాజ్, మైనర్ ఇరిగేషన్ చెరువులను బహిరంగ వేలం వేసే విధానాన్ని రద్దుచేసి నామినల్ లీజుకు మత్స్యసహకార సొసైటీలకు ఇవ్వాలి.
7. పట్టణ ప్రాంతాల్లో వున్న చేపల మార్కెట్లను మహిళా మత్స్య సహకార సంఘాలకు నామినల్ లీజుకు కేటాయించాలి.
8. మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యనందించాలి.
9. సముద్ర వేటకు వెళ్ళే మత్స్యకారులకు రక్షణ పరికరాలు ఉచితంగా ఇవ్వాలి.
10. చేపల నిల్వకు శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లను సొసైటీలద్వారా నిర్మించాలి.

తేది : 25.07.2015

అభివందనములతో...

**భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు)**

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**